జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 12 | ఆగస్టు | 2025 ◆ పేజీలు : 6

## సివిల్స్ కలలకు తెలంగాణ అండ
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





2 లో...




## కలయికలో...
# కటింగ్ స్కాం...

సింగరేణిలో పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ బెల్ట్ విస్తరణ లక్ష్యాల మధ్య కాంట్రాక్టర్లు – అధికారులు కలిసి పచ్చదనాన్ని పెంచుతూ.. ఆ ముసుగులో పచ్చ నోట్ల అవినీతికి పాల్పడుతున్నారు. సింగరేణి భూపాలపల్లి ఏరియాలో 2021–2023 మధ్య యూకలిప్టస్ చెట్ల కటింగ్, పల్ప్ వుడ్ విక్రయాల్లో భారీ అవకతవకలు జరిగినట్టు తెలుస్తోంది. విశ్వసనీయమైన సమాచారం ప్రకారం ఇక్కడ అనుమతికి మించి చెట్లు నరికివేత, తారుమారు లెక్కలు, చెల్లింపులు మిగిల్చి సంస్థ ఖాతాకు రిమిట్ చేయకపోవడం, తప్పుడు ఇన్వాయిసులు సమర్పించడం, లిఫ్ట్ చేసిన వుడ్ పరిమాణాన్ని తప్పుగా చూపించడం వంటి అంశాలు అనేకం వెలుగులోకి వచ్చినట్టు అధికారిక వర్గం తెలుపుతోంది. దీంతో సింగరేణి ఫారెస్ట్ విభాగంలో మొక్కల పెంపుదల, సంరక్షణ, చెట్ల నరికివేత వంటి పనుల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని ఉన్న ఆరోపణలకు ఈ అంశం ఊపిరి పోస్తుంది.

2 లో..

◆ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

- సింగరేణి ఫారెస్ట్ ఫైల్స్ లో అవినీతి సంచలనం
- యూకలిప్టస్ కోతలో లెక్కల మాయం
- అక్కడి ఫారెస్ట్ హెచ్ ఓడి పాత్రపై విజిలెన్స్ కన్ను
- ట్రక్కుల్లో టన్నుల తేడా.. రికార్డుల్లో మాయం
- అసలు అవార్డు లేని ప్లాంటేషన్లలో కటింగ్
- తప్పుడు ఇన్వాయిసులు, బిల్లుల్లో బకాయిల గుట్టు
- రూ. 60 లక్షల నష్టం.. సాక్ష్యాలుగా ఫోన్ సంభాషణలు ?
- ప్రజాధనం దోపిడీకి అధికారులు, కాంట్రాక్టర్ల కలయిక
- సింగరేణి ఫారెస్ట్ విభాగంపై విశ్వాస సంక్షోభం

## డ్రైనేజీ లేక బీటీ రోడ్డు ధ్వంసం...

- పటిష్టత లేకపోవటమే కారణమా
- ప్రమాదంగా మారిన రోడ్డు ప్రయాణం
- వరదలతో కాలువలను తలపిస్తున్న రోడ్డు



**ఆళ్ళపల్లి. ఆగస్టు 11. ప్రజాజ్యోతి:** తరతరాలు మారిన ప్రభుత్వాలు మారుతున్నప్పటికి రోడ్డు, డ్రైనేజీ మారేదేన్నడని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గ్రామానికి మొదటి నుండి ఉన్న ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ అయినప్పటికీ ప్రభుత్వాలు మారుతూనే అధికారులు వస్తూనే ఉన్నా కానీ డ్రైనేజీ పట్టించుకునే పరిస్థితి వారే లేకపోవటం విశేషం. ఆర్టీసీ బస్సు వెళ్లాలన్న మరో వాహనానికి సైడ్ ఇవ్వడానికి సరైన మార్గం లేకాపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్డు 2019–20లో వేసిన రోడ్డు ఈ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక చిన్న చిన్న వర్షాలు పడ్డా వర్షం నీరు డ్రైనేజీ వరద కలిసి ఇళ్లలోకి వస్తుంది. పక్కనే ఉన్న గుడి

2 లో...

## మణుగూరులో పర్యటించిన తుమ్మల

- నూతన జిల్లా సహకార బ్యాంకును సందర్శించి ప్రారంభించిన: మంత్రి తుమ్మల



**మణుగూరు, ఆగస్టు 11, ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు లో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కొత్త భవనాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని, వివరించారు. సహకార బ్యాంక్ ప్రాముఖ్యత గురించి సహకార బ్యాంక్ రైతుల అభివృద్ధికి రుణాలు అందిస్తుందని, ఈ బ్యాంక్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనం దరిపైనా ఉందని

2 లో..

# కలయికలో .. కటింగ్ స్కాం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11, ప్రజాజ్యోతి: సింగరేణిలో పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ బెల్ట్ విస్తరణ లక్ష్యాల మధ్య కాంట్రాక్టర్లు – అధికారులు కలసి పచ్చదనాన్ని పెంచుతూ.. ఆ ముసుగులో పచ్చ నోట్ల అవినీతికి పాల్పడుతున్నారు. సింగరేణి భూపాలపల్లి ఏరియాలో 2021–2023 మధ్య యూకలిప్టస్ చెట్ల కటింగ్, పల్ప్ వుడ్ విక్రయాల్లో భారీ అవకతవకలు జరిగినట్టు తెలుస్తోంది. విశ్వసనియమైన సమాచారం ప్రకారం ఇక్కడ అనుమతికి మించి చెట్లు నరికివేత, తారుమారు లెక్కలు, చెల్లింపులు మిగిల్చి సంస్థ ఖాతాకు రిమిట్ చేయకపోవడం, తప్పుడు ఇన్వాయిసులు సమర్పించడం, లిఫ్ట్ చేసిన వుడ్ పరిమాణాన్ని తప్పుగా చూపించడం వంటి అంశాలు అనేకం వేలుగులోకి వచ్చిన్నట్టు అధికారిక వర్గం తెలుపుతోంది. దీంతో సింగరేణి ఫారెస్ట్ విభాగంలో మొక్కల పెంపుదల, సంరక్షణ, చెట్ల నరికివేత వంటి పనుల్లో అనేక అవకతవకలు జరుగు తున్నాయని ఉన్న ఆరోపణలకు ఈ అంశం ఊపిరి పోస్తుంది.

| విజిలెన్స్ లెక్కల్లో బాకీ బిల్లు | | | | | |
|---|---|---|---|---|---|
| కాంట్రాక్టర్ / ఏజెన్సీ | అవార్డు తూకం మి.ట | రేటు ఒక మి.ట | లిఫ్ట్ చేసింది మి.ట | చెల్లించింది | బకాయి రూ. లక్షల్లో |
| M/s మేకల లక్ష్మన్ | 400 | 1820 | 572.12 | 0 | 12.59 |
| | 220 | 1700 | 218.30 | 158.74 | 1.22 |
| | అసలు అవార్డు చెయ్యలేదు | 1700 | 555.22 | 0 | 11. 42 |
| | అసలు అవార్డు చెయ్యలేదు | 1700 | 100.08 | 0 | 2.06 |
| M/s న్యూటోన్ ఇంజనీరింగ్ | 200 | 3650 | 349.25 | 292.88 | 2.49 |
| | 450 | 1745 | 2046.61 | 591.88 | 30.70 |
| మొత్తం | | | 3796.5 8 | 1043.5 | 60.48 |

గమనిక : మి.ట (మెట్రిక్ టన్నులు) ఇందులో రూ. 38 లక్షల రూపాయిలు ముందే చెల్లింపులు ఉన్నాయి.

### కాంట్రాక్టర్లు – అధికారుల కలయిక స్కాం

సింగరేణి భూపాలపల్లి ఏరియాలో జరిగిన యూకలిప్టస్ చెట్ల కోత, రవాణా, విక్రయాల్లో భారీ అవకతవకల ఆరోపణలు ఇప్పుడు కోల్ బెల్ట్ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. సంస్థ నిర్వహిస్తున్న మైనింగ్ కార్యకలాపాల వల్ల పాడైన భూములను పునరావాసం చేయడం, సంస్థ భూగర్బ గనుల అవసరాల కోసం ఈ చెట్లను యాజమాన్యం పెద్ద ఎత్తున సాగు చేస్తోంది. అవి కోతకు వచ్చిన్నప్పుడు సంభందిత అధికారుల ఆదేశాలతో ప్రైవేటు కాంట్రాక్ట్ లకు ఆ భాద్యతను అప్పగిస్తారు. నిబంధనల ప్రకారం అనుమతితో తొలగించిన చెట్లలో సంస్థ అవసరాలకు కొంత భాగం టింబర్ డిపోలకు, మిగతావి పేపర్ మిల్లుల అవసరాలకు ఆయ కాంట్రాక్టర్లకే విక్రయ బాధ్యతలు అప్పగిస్తారు. అట్టి పైకము మొత్తము ఆ కాంట్రాక్టర్ల నుండి సంస్థ కు అందివ్వాలి. ఈ మొత్తం ప్రక్రియ పారదర్శకంగా, బరువు లెక్కలు సరిగ్గా నమోదు చేసే భాద్యత అక్కడి ఫారెస్ట్ అధికారులదే. అయితే 2021 నుంచి 2023 మధ్య జరిగిన పనుల్లో ఈపార దర్శకత లోపించిదని తెలుస్తోంది. భూపాలపల్లి ఏరియాలోని కొన్ని ప్రాంతాలలో.. కాంట్రాక్టర్లకు నరికివేత పనులు అప్పగించగా అక్కడ కొన్ని అవకతవకలు జరిగినట్టు సమాచారం. ఆ సమయంలో ఇక్కడ ఫారెస్ట్ హెచ్ఓడి పనిచేసిన అధికారి.. అధికారిక లెక్కల్లో కొన్ని తారుమారు చేసినట్టు, తక్కువ బరువు చూపించి, మిగతా వాటిని బయటకు మళ్లించినట్లు విజిలెన్స్ శాఖ దర్యాప్తులో బయటపడింది. ఉదాహరణకు ఒక ట్రక్కులో 20 టన్నుల వుడ్ లోడ్ అయితే, లెక్కల్లో కేవలం 5 టన్నులుగా చూపించి, మిగతా 15 టన్నులను మార్కెట్ లో లేదా సంబంధాలున్న పేపర్ మిల్లులకు అమ్మి, ఆ డబ్బు వ్యక్తిగతంగా పంచుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి కట్టింగ్ చేసిన చెట్లను వాహనం లో లోడ్ చేసి సంస్థ అధికారిక వెయిట్ మిషన్ లో కొలిచిన తర్వతానే బయిటికి పంపిస్తారు. అక్కడ వచ్చిన అసలు బరువును సంభందిత ఫారెస్ట్ అధికారి నిర్ధారించి సంస్థ వాడే ఎస్ఎపి అనే సాఫ్ట్వేర్ లో నమోదు చేస్తారు. అయితే ఇక్కడ ఈ నమోదులో ట్రాన్స్ పోర్ట్ బిల్లులు, డిపో ఎంట్రీలు, వెయిట్ రికార్డులు మూడు మధ్య స్పష్టమైన వ్యత్యాసాలు ఉండటంతో విజిలెన్స్ కు అనుమానం కలిగింది. అయితే ఈ అంశాన్ని మొదటిగా ఓ విజిల్ బ్లోయర్ బయటికి తెలిపినట్టు తెలుస్తోంది. విజిలెన్స్ దర్యాప్తు ఫలితంగా ఈ అవకతవకల ద్వారా సుమారు రూ. 60.10 లక్షల నష్టం సంస్థకు జరిగిందని అధికారిక వర్గాలు తెలుపుతున్నాయి. ఈ విచారణలో అప్పటి ఫారెస్ట్ అధికారి, కింద పనిచేసే ఇద్దరు సిబ్బంది ఫోన్ సంభాషణలు కూడా విజిలెన్స్ కు సాక్ష్యాలుగా లభించాయని సమాచారం. అసలు అవార్డు చేయని ప్లాంటేషన్ లో కూడా కటింగ్ నిర్వహించడం లాంటి అంశాలను విజిలెన్స్ పసిగట్టినట్టు తెలుస్తోంది.

### విచారణలో ఉంది - వెంకన్న జాదవ్ ఐ ఆర్ టి ఎస్ (సింగరేణి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్)



భూపాల్ పల్లి ఏరియాలో యూకలిప్టస్ కోతలో కొన్ని లెక్కలు తారుమారు అయినట్టు మాకు సమాచారం ఉంది. అందులో భాగంగా ఈ అంశంపై అక్కడ పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నాం. ఒకవేళ ఎవరైనా అవకతవకలకు పాల్పడ్డట్టు నిర్ధారణ అయితే కఠినమైన చర్యలు తీసుకుంటాం. సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలను సహించబోము. పారదర్శకతే సంస్థ పనితీరుకు పునాది.

### ప్రధానంగా బయటపడిన అంశాలు:

**అనుమతికి మించి వుడ్ లిఫ్టింగ్**

**అసలు అవార్డు చెయ్యక పోయిన కటింగ్ నిర్వహించడం**

**సంస్థ ఖాతాకు డబ్బు రిమిట్ చేయకపోవడం**

**తప్పుడు ఇన్వాయిసులు, లెక్కల్లో తారుమార్లు**

ఈ సంఘటన సింగరేణిలో వనరుల పరిరక్షణపై ఉన్న నిబద్ధతను ప్రశ్నార్థకంగా మార్చేశాయి. కాగితాలపై హరిత విప్లవం కొన సాగుతున్నా, నేలమీద మాత్రం వనరుల దోపిడీ, అక్రమ కటింగ్స్, నిధుల మాయం ప్రధాన అజెండాగా మారినట్లు స్పష్టమవుతోంది. ప్రజా ధనం దోచుకోవడంలో కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి పద్ధతి ప్రకారంగా పని చేశారనే అనుమానాలు గట్టిపడుతున్నాయి. ఈ కేసులో బహిర్గతమైన 'అసలు అవార్డు చేయని' ప్లాంటేషన్లలో కటింగ్ జరపడం, అది అధికారుల మౌన సమ్మతితో సాధ్యమైందని సూచిస్తోంది. లెక్కల్లో తారుమార్లు, బరువు దాచిపెట్టడం, సంస్థ ఖాతాకు రావాల్సిన లక్షల రూపాయలు ఎక్కడికో మాయం కావడం ఇవన్నీ కలిపి ఈ వ్యవహారాన్ని సాధారణ అక్రమం నుండి పద్ధతి ప్రకారం నడిచిన అవినీతి అంశం గా అనుమానాలు కలిగిస్తున్నాయి. భూపాలపల్లి ఏరియాలో వెలుగులోకి వచ్చిన ఈ 'కటింగ్ స్కాం', భవిష్యత్తులో సింగరేణి ఫారెస్ట్ విభాగం మొత్తం పనితీరుపై పెద్ద ప్రశ్నార్థకాన్ని మిగిల్చింది. అసలు అవార్డు చేయని వాటిని కూడా కటింగ్ నిర్వహించడమే ఈ స్కాం యొక్క గుండె బిందువు.

## సివిల్స్ కలలకు తెలంగాణ అండ

- సివిల్స్ లో తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపికవ్వాలి
- అన్ని విధాలుగా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం
- మెయిన్స్ కు ఎంపికైన 180 మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున అందిస్తున్నాం
- ఇంటర్వ్యూ కి ఎంపికైన వారికి కూడా లక్ష ఆర్థిక సాయం, ఢిల్లీలో వసతులు కల్పనా
- ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకం
- చరిత్రలో నిలిచిపోయే సివిల్స్ అధికారులుగా నిలవాలి
- ప్రజా భవన్ లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ
- ఈ కర్వక్రమాన్ని ఉదేసించి మాట్లాడిన.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులుకోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్
- హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు

**కొత్తగూడెం (సింగరేణి), ఆగస్టు 11, ప్రజాజ్యోతి:** సివిల్ సర్వీసెస్‌లో తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపిక కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆకాంక్షించారు. సోమవారం ప్రజా భవన్‌లో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెయిన్స్‌కు ఎంపికైన 180 మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఇంటర్వ్యూ దశకు ఎంపికైన వారికి కూడా లక్ష రూపాయల ఆర్థిక సాయం, ఢిల్లీలో వసతి సౌకర్యాలు కల్పిస్తామని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, వారిని సానబట్టి వజ్రాలుగా తీర్చిదిద్దితే సమాజానికి మేలు జరుగుతుందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకమని, ఎస్.ఆర్. శంకరన్, పార్థసారథి, మాధవరావు వంటి నిబద్ధత కలిగిన అధికారుల సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్, సంస్థ డైరెక్టర్ గౌతమ్ పొట్రు తదితరులు పాల్గొన్నారు. 2024లో సివిల్స్‌లో విజయం సాధించిన 30 మందికి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ చేపడుతున్న విద్య, ఉపాధి అవకాశాల పెంపు, సామాజిక బాధ్యత కార్యక్రమాలను ఎమ్మెల్యేలు ప్రశంసించారు.

## మణుగూరు లో పర్యటించిన తుమ్మల

(మొదటి పేజీ తరువాయి...)

మంత్రి తెలియజేశారు.రైతుల కోసం ప్రభుత్వ పథకాలు: కాంగ్రెస్ ప్రభుత్వం లో రైతు బంధు, రైతు బీమా, రైతు భరోసా, బోనస్, ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా రైతులకు లక్ష కోట్ల రూపాయల సహాయం అందించిందని తెలిపారు.ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు: ములుగులో ఆయిల్ ఫార్మ్ ఫ్యాక్టరీని ప్రారంభించినట్లు, గతంలో ఈ నియోజకవర్గంలో రోడ్లు, చెరువుల అభివృద్ధికి కృషి చేసినట్లు తుమ్మల గుర్తుచేశారు.నీటిపారుదల ప్రాజెక్టులు మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తయితే దాదాపు 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, పులుసుబొంత ప్రాజెక్టుకు అటవీ శాఖ అనుమతులు రాగానే పినపాక మండలంలో సాగునీరు అందించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి వి పాటిల్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డ్రైనేజీ లేక బీటీ రోడ్డు ధ్వంసం...

(మొదటి పేజీ తరువాయి...)

ప్రాంగణం మొత్తం కూడా వరదతో నిలిచిపోతుందని ప్రజలు పేర్కొంటున్నారు. డ్రైనేజీ ఆనుకోని ఉన్నరోడ్డుపై వరద పోవడం వల్ల రోడ్డు మొత్తం ధ్వంసం అయి, గ్రామంలో నీరు అంత ఈ సైడ్ డ్రైనేజీ ద్వారానే పక్కనే ఉన్న జల్లేరు, కోడెల వాగులో కలవడం వల్ల ఈ డ్రైనేజీ మెరుగుపడితే గాని రోడ్డు మెరుగుపడుతుందని ప్రజలు ఈ సైడ్ డ్రైనేజీ తో పాటు బీటీ రోడ్డు బదులు సిసి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మర్కోడు గ్రామ పంచాయతీ నుండి పక్క గ్రామాలు పెద్దూరు, చీమలగుంపు, నడిగూడెం, జాకారం మీదుగా లొద్దిగూడెం బస్సులు వెళ్లే ప్రధాన రహదారి కావడం గమనార్హం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు చొరవ చూపి పటిష్టమైన డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు





# సెలవులకు ఊరెళ్తున్నారా.. జరభద్రం!

- ఇండ్లకు తాళాలు వేసి దూర ప్రయాణాలు చేసేవారు పోలీస్ వారికి సమాచారం అందించండి : ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి):** తాళాలు వేసివున్న ఇండ్లు టార్గెట్ గా దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తూన్నారని, ప్రయాణాలు చేసే వారు ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకొని, పోలీసు వారికి సమచారం అందించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. ఈ నెల 15, 16, 17 తేదీలలో వరుస సెలవుల దృష్ట్యా, చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, జిల్లా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని స్పష్టం చేసారు . అంతర్రాష్ట్ర దొంగల ముఠా మన జిల్లా పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు పోలీసు వారికి సమాచారం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు సూచించారు. దొంగతనాల నియంత్రణ చర్యల్లో భాగంగా పోలీసు శాఖ తరఫున రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీని ముమ్మర చేసామన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్ ను సంబంధిత పోలీసు స్టేషన్ లో సమాచారం అందించాలని, తద్వారా వారి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేసుకుని వారి ఇండ్ల పరిసర ప్రాంతాల్లో నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని మీ ఇంటి దగ్గర గల మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వారికి చెప్పడం మంచిదన్నారు. విలువైన వస్తువుల సమాచారాన్ని,




వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదని సూచించారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం సురక్షితం అన్నారు. ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలని, బ్యాగుల్లో బంగారు నగలు, డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు తమ దగ్గరే పెట్టుకోవాలని సూచించారు. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభమని తెలిపారు. ఇండ్లలో, కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మన జిల్లాలోని సింగరేణి, కెటిపిఎస్,నవభారత్,ఐటీసీ, బిటిపిఎస్, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలు తమ ఉద్యోగుల నివాస కాలనీలలో, గేటెడ్ కమ్యూనిటీలలో సీసీ కెమెరాలు, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై జిల్లా కమాండ్ కొంట్రోల్ నంబరు 8712682128నకు గానీ, డయల్ 100కు గానీ ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

## నులిపురుగుల దినోత్సవ కార్యక్రమం



**చర్ల , ఆగష్టు 11(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం (కొయ్యూరు) ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల దినోత్సవ కార్యక్రమం జరిగింది .చర్ల ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్ర పరిధిలోని 56 అంగన్వాడి సెంటర్లు 40 గవర్నమెంట్ స్కూల్స్, కేజీబీవీ, ఏకలవ్యస్కూల్, ప్రైవేట్ స్కూళ్లలో ఒక సంవత్సరం నుండి 19సంవత్సరాల లోపు పిల్లల అందరికీ నులిపురుగుల నివారణ కొరకు ఆల్బెం డజోల్ టాబ్లెట్ ఇవ్వడం జరిగినది.ఈ సందర్భగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొత్తం ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వరకు ఉన్న విద్యార్థులు 5535 మంది ఉండగా అందులో 98 శాతం మందికి ఆల్బెండజోల్ టాబ్లెట్ మింగించటం జరిగినది అని అన్నారు .వివిధ కారణాలతో స్కూలుకి రాలేకపోయిన విద్యార్థులకు 18 వ తారీఖున మాప్ అప్ డే ఉంటుంది అని ఆరోజు మిగిలిన విద్యార్థులు కూడా ఆల్బెండజోల్ టాబ్లెట్లు మిగించడం జరుగుతుంది అని అన్నారు. విద్యార్థుల చురుకుదనానికి , రక్తహీనత నివారణకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుంద ని కనుక ఏ ఒక్క విద్యార్థి ఈ టాబ్లెట్ వేసుకోకుండా ఉండకూడదు అని తెలియజేశారు.ఈ కార్యక్రమం విజయవంతం అవ్వటానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మొబైల్ డాక్టర్ సచిన్, ఆర్ బి ఎస్ కే వైద్యులు డాక్టర్ సందీప్ , డాక్టర్ స్ఫూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

- ఎర్రగుంట హై స్కూలులో ఆల్బెండజోల్ పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ




**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 11, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ప్రారంభించారు. పిల్లల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి మద్దతు ఇవ్వడం లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం, స్థానికంగా ఆరోగ్య అవగాహన పెంపొందించే దిశగా ఒక కీలక అడుగుగా నిలిచింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విద్యార్థులకు స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు డాక్టర్ ప్రియాంక, మండల విద్యాధికారి ఆనంద్, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య సంరక్షణకు నులిపురుగుల నివారణ ఎంతో అవసరమని, ఇది వారి చదువులో రాణించడానికి, ఆరోగ్యంగా ఎదగడానికి కీలకమని తెలిపారు. నులిపురుగుల వల్ల పోషకాహార లోపం, రక్తహీనత, పాఠశాల హాజరు తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం రెండుసార్లు నిర్వహించే ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో ఆల్బెండజోల్ మాత్రలు ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన సురక్షిత ఔషధమని, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలల్లో పంపిణీ జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలో సోమవారం మొత్తం 5,376 మందికి మాత్రలు అందజేసినట్లు డాక్టర్ ప్రియాంక వివరించారు.

## 82 శాతం వార్షిక ఉత్పత్తి సాధించిన ఇల్లందు ఏరియా



**ఇల్లందు, ఆగస్ట్ 11, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాకు 2025-26 వార్షిక సంవత్సరానికి గాను జులై నెల వరకు నిర్దేశించిన 11.69 లక్షల టన్నులకు గాను 9.54 లక్షల టన్నులతో 82 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జియం వీసం. కృష్ణయ్య తెలిపారు. సోమవారం స్థానిక జియం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జియం మాట్లాడుతూ జూలై నెలకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 2.13 లక్షల టన్నులకు గాను 1.33 లక్షల టన్నులతో 62 శాతం ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. 0.11 లక్షల టన్నుల బొగ్గును రైల్వే మార్గం, 0.58 లక్షల టన్నులు రోడ్డు మార్గం, 0.42లక్షల టన్నులను ఆర్సిహెచ్పి ద్వారా రవాణా చేయడం జరిగిందని తెలిపారు. జూలై నెలలో 3 రేకుల ద్వారా బొగ్గు రవాణా చేశామన్నారు. బొగ్గు రవాణా గత వార్షిక సంవత్సరంలో జులై 13 లక్షల టన్నులు, ప్రస్తుతానికి జులై నెలకు 8.52 లక్షల టన్నులను రవాణా చేయడం జరిగిందని, గత వార్షికోత్సవం కంటే 5.29 లక్షల టన్నులు తక్కువ రవాణా చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం ఇల్లందు ఏరియాలో ఉత్పత్తి అయ్యే జి 13 గ్రేడ్ బొగ్గును పవర్ ప్లాంట్స్ లు అడుగుతున్నందున వాటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కోయగూడెం నుంచి ఉత్పత్తి అయ్యే బొగ్గులో శేల్ బొగ్గును సపరేట్ చేయడం వల్ల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. నూతన జెకె ఓసి ప్రాజెక్ట్ సెప్టెంబర్ నెలలో ప్రారంభించడం జరుగుతుందని, ఏ ఓసిలో జి 12, జి 14 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి అవుతుందని తెలిపారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి చేసేందుకు ఓసి ఎక్కువగా ఉండడం వల్ల బొగ్గు ధర ఎక్కువగా ఉంటుందని, పరిశ్రమలు ధర విషయంలోనే బొగ్గును కొనుగోలు చేయడం లేదన్నారు. ఇల్లందు ఏరియాకు కేటాయించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి రక్షణతో లక్ష్యానికి కృషి చేసిన సంబంధిత అధికారులు, సూపర్వైజర్స్, యూనియన్ నాయకులు, ఉద్యోగులకు జియం అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ఓటూ జియం రామస్వామి, డిజియం (ఐఈడి) గిరిధర్ రావు, డిజియం (పర్సనల్ ) అజ్మీరా తుకారాం, కెఓసి పిఓ గోవిందరావు, డిజియం (ఫైనాన్స్) మధుబాబు, డిజియం (సివిల్) రవికుమార్, సీనియర్ పర్సనల్ అధికారి గొల్ల సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రతి పేదవారికి కార్పొరేట్ వైద్యం

- ప్రజా ప్రభుత్వంలో ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత
- సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య సహాయంలో ప్రజలకు భరోసా అందుతుంది... ఎమ్మెల్యే జారే






**అశ్వారావుపేట, ఆగస్టు 11, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వంలో ఆరోగ్య విషయంలో ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని ప్రజల ఆరోగ్య సంరక్షణ విషయంలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 38 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ.13.15లక్షలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జారే ఆదినారాయణ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మంచి వైద్యం అందించుకోవాలన్న ప్రజల ఆకాంక్షలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందుతున్న సహాయంతో వారి మొహాల్లో చిరునవ్వు కనిపిస్తుందన్నారు. పేదలకు ఆరోగ్య విషయాల్లో సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

## రైతు బీమా పథకం కోసం తగిన పత్రాలుఇవ్వండి

- వ్యవసాయ అధికారులు
- చివరి తేదీ ఈ నెల 13



**జూలూరుపాడు,ఆగష్టు 11( ప్రజా జ్యోతి ):** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చే రైతుబీమా పథకం లో చేరేందుకుఆగస్టు 13 వ తారీకు చివరి తేదీగా ప్రకటించడంతో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు మండల వ్యాప్తంగా ఉన్న రైతులను. రైతు బీమా పథకంలో చేర్పించడంలో బిజీగా ఉన్నారు, మండల వ్యాప్తంగా జూలూరుపాడు, మాచిన్నపేట, కాకర్ల, పాపకొల్లు గ్రామాలకు చెందిన వ్యవసాయవిస్తరణ అధికారులు రైతులను రైతు బీమా పొందేందుకు కావాల్సిన పత్రాలను సమర్పించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తూ పత్రాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా ప్రమాదవశాత్తు మరణించిన రైతులకు రైతు బీమాలు అందిస్తున్నారు. విస్తరణ అధికారులు గోపికృష్ణ,జెవిడి ప్రసాద్,విజయభాను లు రైతులు బీమా చేయించుకునేందుకు గడువు తక్కువగా ఉన్నందున ఈనెల 13వ తారీకు లోపు రైతు బీమా దరఖాస్తులు సమర్పించాలని కోరుతున్నారు.

## గ్రామసభలో నా పేరు చదివారు...

- డబులెబెడ్రూం ఇల్లు ఇవ్వలేదు
- నాకు డబుల్ బెడ్ ఇల్లు ఇవ్వాల్సిందే
- డబుల్ బెడ్ రూమ్ సముదాయంలోని ఓ ఇంట్లో పెట్రోల్ బాటిల్తో బాధిత మహిళ బైఠాయింపు



**భద్రాచలం, ఆగస్టు 11,ప్రజాజ్యోతి** :భద్రాచలం పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సరిత అనే మహిళ ఎంతోకాలంగా ఇల్లు లేక పోవడంతో అందరితో పాటు తాను కూడా ప్రజాపాలన గ్రామసభలో డబుల్ బెడ్ రూమ్ ఇంటికి దరఖాస్తు చేసుకుంది. అయితే ఇటీవల డబుల్ బెడ్రూం ఇండ్ల మంజూరుకు సంబంధించి జరిగిన గ్రామసభలో తన పేరును అధికారులు చదివినప్పటికీ ఇప్పుడు ఇళ్లు కేటాయించలేదని, తనకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని మనుబోతుల చెరువు వద్ద ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూం ఇంటి తాళం పగలగొట్టి బాధిత మహిళ పెట్రోల్ బాటిల్ తో ఆత్మాహుతికి పాల్పడతానని బైటాయించింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సరిత మనుబోతుల చెరువు డబుల్ ఇండ్ల సముదాయంలో తనకు ఇల్లును కేటాయిస్తామని అధికారులు గ్రామసభలో పేరు చదివి వినిపించారు. అయితే ఇప్పటికీ ఇల్లు రాకపోవడంతో విసిగి వేసారిన సరిత మనుబోతుల చెరువు డబుల్ బెడ్రూం సముదాయంలో ఖాళీగా ఉన్న ఓ ఇంటి వద్ద తాళాన్ని పగలగొట్టి పెట్రోల్ బాటిల్ వెంట తీసుకువెళ్లి బైఠాయించింది. ఇప్పుడున్న ఇంటిలో ఎవరూలేరని, ఖాళీగానే ఉందని ఈ ఇంటిని తనకు కేటాయించాలని లేనిపక్షంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడతానని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాకుండా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చిన వారిలో కొందరు ఇక్కడ ఉండకుండానే అద్దెకు ఇస్తున్నారని, అలాంటి వారి పట్ల అధికారులు విచారణ చేపట్టి నిరుపేదలైన తమకు ఇల్లు కేటాయించాలని బాధిత మహిళ వాపోయింది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు బాధిత మహిళ సరితతో ఫోన్ లో మాట్లాడి నీ పేరు ప్రతిపాదిత జాబితాలో ఉందని, ఉన్నతాధికారులతో మాట్లాడి ఇల్లు మంజూరయ్యేలా కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో ఆ మహిళ ఆందోళన విరమించింది.

## నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలి

- ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాచలం, ఆగస్టు 11,ప్రజాజ్యోతి** :ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకునేలా వైద్యశాఖ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నులిపురుగుల నిర్మూలన కేంద్రాన్ని ఆయన ప్రారంభించి విద్యార్థులకు ఆల్డెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాత్రల ద్వారా పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమాంద్యం, చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. 1 నుంచి 19 ఏళ్లు వయస్సున్న పిల్లలందరికీ వీటిని వేసేలా వైద్యశాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలందరూ భోజనం చేశాకే ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ సీజన్లో పిల్లలందరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, భోజనం చేయడానికి ముందు, బాత్రూంకు వెళ్లడానికి ముందు చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్వో సైదులు, డిప్యూటీ డీఎంహెచ్వో చైతన్య, వైద్యశాల సిబ్బంది, పాల్గొన్నారు.

# నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో ఎమ్మెల్యే జారె





**దమ్మపేట, ఆగస్టు 11, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం పట్వారిగూడెం జెడ్పీహెచ్ఎస్, అంకంపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, గండుగుల పల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు, సిరప్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1–19 ఏళ్ల పిల్లల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. నులి పురుగులు పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఎదుగుదల సమస్యలకు కారణమవుతాయని, వాటి నివారణకే మందులు ఇస్తున్నామని వివరించారు. ఒకటినుంచి ఐదేళ్ల పిల్లలకు సిరప్, ఐదు ఏళ్ల పైబడిన వారికి మాత్రల రూపంలో ఔషధం అందజేస్తున్నట్టు చెప్పారు. రోగనిరోధక శక్తి పెంపుతో పాటు చదువులో ఏకాగ్రత కోసం ఇది ఉపకరిస్తుందని, వ్యక్తిగత శుభ్రత, చేతులు కడుక్కోవడం, బూట్లు ధరించడం వంటి అలవాట్లు నులిపురుగుల నివారణకు తోడ్పడతాయని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ వాసం రాణి, ఎంఈఓ కీసరి లక్ష్మీ, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి నీళ్లు అందిస్తాం

- రూ. 1.37 కోట్లతో
- భగీరథ ట్యాంకులకు భూమి పూజ





**ఇల్లందు, ఆగస్టు 11, ప్రజాజ్యోతి:** మండలంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి మంచినీళ్లు అందిస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కేవలం 20 నెలల కాలంలోనే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, మహిళలకు వడ్డీ లేని రుణాలు తదితర అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిందని పేర్కొన్నారు. ఇప్పటికే రైతులకు పెద్ద ఎత్తున రుణమాఫీ చేశామని, రైతు భరోసా ఇచ్చామన్నారు. ఈ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉందని, రైతులెవరు ఆందోళన చెందవద్దని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి అవసరాన్ని తీరుస్తామని, రానున్న కాలంలో పార్టీని, ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. అంతకుముందు మండలంలోని మొట్లగూడెంలో రూ.32 లక్షలు, ఒడ్డుగూడెం పంచాయతీలోని ఒడ్డుగూడెంలో రూ.20 లక్షలు, నెహ్రూ నగర్ లో రూ.20 లక్షలు, చల్ల సముద్రం గ్రామ పంచాయతీలోని వేములవాడ వద్ద రూ. 21లక్షలు, మర్రిగూడెం గ్రామపంచాయతీ లోని ఏడుప్పలగూడెంలో రూ.25 లక్షలు, మాణిక్యారం పంచాయతీలోని మంగయ్య గుంపులో రూ.18 లక్షలతో నిర్మించను న్న వాటర్ ట్యాంక్ లకు భూమి పూజ చేశారు. అనంతరం రేపల్లెవాడ పంచాయతీ లోని క్రాస్ రోడ్ వద్ద పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పిఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, మాజీ వైస్ యంపిపి మండల రాము, మెట్ల కృష్ణ, నాయకులు తాటి భిక్షం, పూనెం సురేందర్, పాయం కృష్ణ ప్రసాద్, పాయం లలిత, కల్తీ పద్మ, తాటి చుక్కమ్మ, మోకాళ్ళ వెంకటమ్మ, శారద, పిఏసిఎస్ అధికారి హీరా లాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎటపాక రహదారిలో ఇరుక్కుపోయిన టిప్పర్ భారీగా ట్రాఫిక్ జామ్

- జేసీబీతో మరమ్మతులు చేసిన డా జమాల్ ఖాన్
- వైద్యంలోనే కాదు సాయంలోనూ ముందుంటున్న జమాల్ ఖాన్





**భద్రాచలం ,ఆగస్టు 11,ప్రజాజ్యోతి :** భద్రాచలం నుండి చర్లకు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలలో భద్రాచలం నుండి గౌరవరం వెళుతున్న మెటల్ లోడు టిప్పర్ అదుపుతప్పి గోతిలో పడిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. గంటల కొలది వ్యవధి కావడంతో రెండు వైపులా భారీ వాహనాలు ఆర్టిసి బస్సులు ప్రైవేటు వాహనాలు చిక్కుకున్నాయి. విషయం తెలుసుకున్న జేకేసిటీ ట్రస్ట్ చైర్మన్ ఎండి జమాల్ ఖాన్ వెంటనే ట్రాఫిక్ వద్దకు వెళ్లి జరిగిన సంఘటనను తెలుసుకొని వెంటనే జెసిబి తెప్పించి గోతులను పూడ్చి రహదారి సౌకర్యాన్ని కల్పించడంతో ఇరు రువైపులా వాహనాల రవాణా క్లియర్ చేశారు. ఇది గమనించిన ఎటపాక పోలీసు సిబ్బంది వాహనాలను అదుపు చేస్తూ భారీ వాహనాలను నియంత్రిస్తూ ట్రాఫిక్ సమస్యను తొలగించారు. టిప్పర్ డ్రైవర్ అనారోగ్యం వలన జ్వర పీడితుడు కావడంతో ఈ ఘటన జరిగిందని తెలియడంతో డ్రైవర్ను తన ఆసుపత్రికి తీసుకువెళ్లి ఆహారం ఇచ్చి చికిత్సలు కూడా జమాల్ ఖాన్ నిర్వహించారు. భారీ స్థాయిలో చర్ల వైపు నుండి ఎటపాక మండలం మీదుగా తెలంగాణ వైపుకు వెళుతున్న ఇసుక లారీల తాకిడికి రోడ్డు ధ్వంసం అయింది. గతంలో స్థానికులు కూడా భారీ స్థాయిలో రాత్రి పగలు తరలి వెళ్తున్న ఇసుక వాహనాల వలన దుమ్ము ధూళితో వాహనదారులు గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన కూడా చేపట్టడం జరిగింది. జమాల్ ఖాన్ సహాయంతో ఈరోజు సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెకేసి ట్రస్ట్ సభ్యులు నటరాజ్, అజీజ్, జావీద్, షాజహాన్ పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరి

- ఎమ్మెల్యే కోరం కనకయ్య




**టేకులపల్లి, ఆగష్టు11, ప్రజాజ్యోతి:** నులిపురుగులతో పిల్లల్లో శారీరక ఎదుగుదల, మానసిక అభివృద్ధి తగ్గుతుందని, అందుకే 19 ఏళ్ల లోపు తప్పకుండా నులిపురుగల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య సిబ్బంది టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని . ఎమ్మెల్యే కోరం మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించినట్లయితే చాలా వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని కాబట్టి పిల్లలందరూ స్కూల్ పరిసరాలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదేవిధంగా పిల్లల పొట్టలో నులిపురుగులు ఉండడంవల్ల రక్తహీనత వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోవడం మగత అలసట తరచూ వ్యాధుల బారిన పడటం తద్వారా చదువుల్లో ఆటల్లో వెనుకబడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నులి పురుగుల నివారణ టాబ్లెట్లను సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు పిల్లలు అందరూ తప్పనిసరిగా మింగాలని ఈ సందర్భంగా పిల్లలకు , పిల్లల తల్లిదండ్రులకు సూచించారు అదేవిధంగా నులి పురుగుల నివారణకు తినేటప్పుడు త్రాగేటప్పుడు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు పరిశుభ్రం చేసుకోవాలని ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని ఉపయోగించుకోవాలని పండ్లు కూరగాయలు పరిశుభ్రంగా కడిగిన తర్వాత మాత్రమే ఉపయోగించుకోవాలని పిల్లలకు ఆరోగ్య విద్యా బోధన చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కందుల దినేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రావు ,ఉపాధ్యాయులు,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్వైజర్ గుజ్జ విజయ, నాగు బండి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీ లాల్ నాయక్ ,పెద్దలు రెడ్యానాయక్ ,లక్ష్మయ్య పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత చింతల



**భద్రాచలం కల్చరల్ , ఆగస్టు 11,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వరరెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయంలోని ఉప ఆలయాలైన లక్ష్మీతాయారు, అభయాంజనేయస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారులు రామిరెడ్డి, సురేందర్రెడ్డి, నర్సింహారెడ్డి, నారాయణమూర్తి, దేవేందర్రెడ్డి, రాధ, చరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తీరంగా యాత్ర



**అశ్వాపురం, ఆగష్టు 11(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో (హర్ ఘర్ తీరంగా) ఇంటింటికి జాతీయ జెండా కట్టే కార్యక్రమం,మండల అధ్యక్షులు ఉమ్మ సుధాకర్ రెడ్డి అధ్యక్షత . ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైస్ ప్రెసిడెంట్ బిజ్జం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి పెంపొందాలని సూచించారు.అలాగే ప్రతి బూతులో జాతీయ జెండా ఎగరవేసి జాతీయగీతం ఆలపించి జాతీయ జెండాకు సెల్యూట్ చేసి గౌరవం వందనం అందించాలని బూత్ అధ్యక్షులకి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఈనెల 11తేదీ నుండి 14వ తేది వరకు ఇంటి ఇంటికి జాతీయ జెండాలు పంపిని చెయ్యాలని ఆగస్టు 15 న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగర వేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించలని సూచించారు. మండల ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల సురేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చీమల శ్రీలత, కార్యదర్శులు రెబ్బలపల్లి బ్రహ్మాచారి, గోపి గాంధీ, మరియు సీనియర్ నాయకులు,బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాలుగోన్నారు.

## ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలి




**పాల్వంచ(రూరల్), ఆగష్టు 11,ప్రజా జ్యోతి:** స్థానిక చంద్రా రాజేశ్వరరావు భవన్ లో నిర్వహించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్ కే.షాహిద్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ మంగళవారం ఆగస్టు 12వ 89 వసంతాలు పూర్తి చేసుకుని 90 వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలంలో ఏ ఐ ఎస్ ఫ్ పతాకాన్ని ఆవిష్కరించి ఘనంగా వేడుకలు నిర్వహించాలని కోరారు.ఆగస్టు 12,1936 నా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో నగరంలోని బెనారస్ విశ్వవిద్యాలయంలో పొతీల్లాలోనే పిడికిలి బిగించి చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదిస్తూ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న మొట్టమొదటి ఈ దేశ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. నాటి నుండి నేటి వరకు విద్యారంగా సమస్యలపై వాటి పరిష్కారాలకై సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థి అమరవీరుల త్యాగాలతో ఎరుపెక్కిన ఏఐఎస్ఎఫ్ జెండాను విద్యార్థులందరూ హక్కునా చేర్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.కే షాహిద్,జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన,గుగులోత్ వంశీ,వినయ, పవన్ సాయి,నాగేంద్ర బాబు, బత్తుల సాయి,రాజ్ కమల్, శ్రీకాంత్,మహేష్, రవి,వెంకటేష్, సునీల్,యోగి,ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలి

- సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుండె పిన్ని వెంకటేశ్వర్లు



**జూలూరుపాడు, ఆగష్టు 11(ప్రజా జ్యోతి ):** రాష్ట ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుండె పిన్ని వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్టప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ దరఖాస్తులు చేసుకొని , కార్యాలయాల్లో కొత్త పెన్షన్ల మంజూరు కోసం వేలాది మంది అర్హులైన వృద్ధులు వితంతువులు,వికలాంగులు దరఖాస్తులు చేసుకొ ని ఎదురుచూస్తున్నారని అన్నారు.అనేకమంది భర్తను కోల్పోయిన వితంతువులు ఏ ఆసరా లేక ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేస్తుందని ఆశతో ఎదురు చూస్తుంటే రెండేళ్లు కావస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ గురించి మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో పెన్షన్ పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు ఆసరా పెన్షన్ దారులకు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చక ఓటమి పొందా రని వారిలా కాకుండా అర్హులైన నిరుపేదలకు తక్షణమే కాంగ్రెస్ పార్టీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు.

## ఎస్ కే యం పిలుపు 13న జరుగు ప్రదర్శనను జయప్రదం చేయండి

**టేకులపల్లి,ఆగష్టు11,ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా 13న ఎస్ కే యం పిలుపులో భాగంగా జరుగు ప్రదర్శనను జయప్రదం చేయండి..కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా యస్.కె.యం ఇచ్చిన పిలుపులో భాగంగా 13వ తేదీన టేకులపల్లిలో ఎస్ కెయం జేఏసీ ఆధ్వర్యంలో జరుగు ప్రదర్శనను జయప్రదం చేయాలని యస్ కె యం నాయకులు డి. ప్రసాద్ (ఐ ఎఫ్ టి యు) భూక్య హర్జ ఎట్టి,నరసింహారావు (ఏఐకేఎంఎస్) గుగులోతు రామచందర్ ( రైతు సంఘం) కడుదుల వీరన్న (వ్యవసాయ కార్మిక సంఘం) పిలుపునిచ్చారు.రైతు వ్యతిరేక నాలుగు చట్టాలను కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా కార్మిక కర్షక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు.ఎస్కేయం ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాల క్రితం ఢిల్లీ కేంద్రంగా జరిగిన పోరాట ఫలితంగా రైతు వ్యతిరేక నాలుగు నల్ల చట్టాలను విరమించుకుంటున్నానని పార్లమెంటు సాక్షిగా ప్రతిజ్ఞ చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేడు వాటిని రద్దు చేయలేదని తిరిగి వాటిని అమలు చేయడం కోసం పూనుకుంటున్నాడని అన్నారు అదేవిధంగా 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడులు గా తీసుకురావడం కార్మిక వర్గా వ్యతిరేక చర్య అని అన్నారు.నరేంద్ర మోడీ కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా 13వ తారీకున టేకులపల్లి లో జరుగు ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎస్ కే యం నాయకులు కల్తీ వెంకటేశ్వర్లు, ఈసం నరసింహారావు, ఆయిత శ్రీరాములు , పొట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



## బంజారాలు భక్తి శ్రద్ధలతో జరుపుకునే వేడుక "తీజ్"



**పాల్వంచ(రూరల్), ఆగష్టు 11,ప్రజా జ్యోతి:** పాల్వంచ శేఖరంబంజర్ లో ఘనంగా తీజ్ వేడుకలు ఎం.ఎల్.ఏ కూనంనేనితో కలిసి పాల్గొన్న రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల,పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని శేఖరంబంజర్ లో ఆదివారం రాత్రి తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.తొమ్మిది రోజుల పాటు మహిళలు వేరు వేరు అంశాలతో పూజలు చేశారు.చివరి రోజున భక్తి శ్రద్దలతో తీజ్ వేడుకలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుతో పాటు రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్,డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అతిధిగా పాల్గొని పూజలు చేశారు.ఈ సందర్బంగా కొత్వాల మాట్లాడుతూ బంజారాలు ఎంతో భక్తి శ్రద్దలతో తొమ్మిది రోజులు జరుపుకునే వేడుక తీజ్ అని అన్నారు.ఎంతో ఆనందోత్సాహాలతో మహిళలు సాంప్రదాయనృత్యాలు చేస్తూ ఆనందంగా వేడుకలు జరుపుకుంటారని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బాలూ నాయక్,స్వరాజ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు ఎస్. ఏ జలీల్, వై.వెంకటేశ్వరరావు,శనగా రాంచందర్,సిపిఐ అడుసుమల్లి సాయి బాబు, చెరుకూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ



**భద్రాచలం కల్చరల్ , ఆగస్టు 11,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్ కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడా మండపంలో నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

## నులి పురుగుల నివారణ మాత్ర వేసుకోవాలి



**పాల్వంచ(రూరల్), ఆగష్టు 11,ప్రజా జ్యోతి:**నులి పురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నందు ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి ఆల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు వేయడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ పులి పురుగులు కడుపులో ఉండడం వలన పోషకాహార లోపం రక్తహీనతతో త్వరగా అలసిపోతారని మానసిక అభివృద్ధి మందగిస్తుంది కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థి ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరామ్ మూర్తి,డాక్టర్ బి.రాజు,హెల్త్ సూపర్వైజర్ పి.కృష్ణయ్య,వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు,డాక్టర్ మధు బాబు,ఏపీఓ పోరండ్ల రంగా,ఇతర సిబ్బంది ఉప్పలయ్య,రమాదేవి,విజయ తదితరులు పాల్గొన్నారు.

## రవికాంత్ మృతిపై తండ్రి అనుమానం



**టేకులపల్లి, ఆగష్టు 11, ప్రజాజ్యోతి**: ఇటివలే టేకులపల్లిలో మృతి చెందిన పెద్ద కుమారుడు వై.రవికాంత్ మరణంపై అనుమానం ఉందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని మృతుడి తండ్రి వై ఆర్జున్ రావు అన్నారు. టేకులపల్లి మండల కేంద్రంలో టేకులపల్లి ప్రెస్ క్లబ్లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు... వై రవికాంత్ ఆర్ఎంపీగా జీవనం సాగిస్తు ఉండేవాడని, గత కొన్ని నెలలుగా గుండుబాకు అలవాటై స్నేహితులతో తాగుతున్నాడని తెలిపారు. మృతి చెందిన రోజునా గుండుంబా తాగి ఇంటికి రాలేని స్థితిలో ఉన్నాడని, కొందరు స్నేహితులు ఇంటికి సమీపంలో దింపి వెళ్ళారని అన్నారు. తర్వాత కొంత సేపటికే మృతి చెందాడని, మృతి చెందిన సమయంలో నోంట్లో నుంచి నురగ వచ్చిందని మృతి చెందిన సమయంలో కారణాలు అర్ధం కాలేదని అన్నారు. గుండుంబా తయారీ చేసే వారికి మాకు గతంలో గొడవ జరిగయని, ముగ్గురు స్నేహితులతో గుడుంబా తగినట్లు తెలిసిందని అన్నారు. నా కుమారుడు రవికాంత్ మృతి గుండుంబాతోనేనా లేక ఎలా మరణించడో పోలిసులు తెలుసుకొని మాకు న్యాయం చేయాలని కోరారు. ప్రెస్మిట్లో తండ్రి వై . అర్జున్ రావు, తల్లి వై. లక్ష్మి,వై. రవికాంత్ భార్య మణి, కుతూరు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం





**ఆళ్ళపల్లి,ఆగస్టు11,ప్రజాజ్యోతి**:సోమవారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్యురాలు సంఘమిత్ర వారి సిబ్బందితో అంగన్వాడీ ప్రభుత్వ. ప్రైవేటు విద్యాసంస్థలలో మాత్రల పంపిణీని ప్రారంభించారు. పిల్లల ఆరోగ్యంగా ఉండేందుకు చక్కగా చదువుకోవాలనే విదంగా ఈ కార్యక్రమం చేపట్టినఈ కార్యక్రమంలో విద్యార్థులకు స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు సంఘమిత్ర. వారి సిబ్బంది, పాఠశాల సిబ్బంది. అంగన్వాడీ సిబ్బంది. ఆశలు పాల్గొన్నారాని తెలిపారు. మండల పరిధిలో సోమవారం మొత్తం 1600 మందికి మాత్రలు అందజేసినట్లు డాక్టర్ వివరించారు. పండుగ సందర్భంగా వేరువేరు ప్రాంతాలు వెళ్ళిన వారి కోసం తిరిగి 18 వ తారీకు నులిపురుగు నివారణ మందు పంపిణీ ఉంటుందని తెలియజేశారు.

# నులిపురుగుల నివారణ మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు

- విద్యార్థులకు చదువుతో పాటు మంచి ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యం:జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**పాల్వంచ(రూరల్), ఆగష్టు 11,ప్రజా జ్యోతి:**నులిపురుగుల నివారణ మాత్ర ల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు,విద్యార్థుల విద్యా ప్రగతికి శారీరక,మానసిక ఆరోగ్యం కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నా రు.అంతర్జాతీయ నులిపురుగుల దినో త్సవం సందర్భంగా,సోమవారం నాడు పాల్వంచ బొల్లారిగూడెం మైనారిటీ పాఠశాలలో నిర్వహించిన,జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమమునకు స్థానిక శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కలెక్టర్ మాట్లాడుతూ,పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటేనే చదువులో పూర్తి స్థాయి దృష్టి పెట్టగలరని,అందుకే నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రాధాన్యత వహిస్తోందని తెలిపారు. నులిపురుగులు శరీరంలో ఉండటం వలన పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత,ఆకలి తగ్గడం, అలసట, కడుపు నొప్పి,వికారం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని,ఇవి వారి శారీరక ఎదుగుదల,చదువులో ఏకాగ్ర త,మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించా రు.ఈ సమస్యలను నివారించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంను ప్రతి సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఆల్బెం డజోల్ మాత్రలు నులిపురుగులను పూర్తిగా నిర్మూలించడంలో,రోగ నిరో ధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.జిల్లా వ్యాప్తంగా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల 3,36,136 మంది పిల్లలు యువతకు ఈ మాత్రలు అందించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి వైద్య ఆరోగ్య శాఖతో పాటు అన్ని సంబంధిత ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రతి పాఠశాల,వసతి గృహం, అంగన్వాడీ కేంద్రం,కళాశాల లో ఈ మాత్రలు అందుబాటులో ఉండే లా చర్యలు తీసుకోవాలని సూచించారు.కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు మాట్లాడుతూ.నులిపురుగుల నివారణ మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకపోవడంతో పాటు,ఎలాంటి అపోహ లు పెట్టుకోకూడదని ప్రజలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు.మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు ఇవ్వాలని,1–2 సంవత్సరాల వయసు పిల్లలకు సగం మాత్ర, 2–19 సంవత్సరాల వారికి పూర్తి మాత్ర నమిలి మింగేలా చేయాలని సూచించారు.ఆగస్టు 18 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 19 ఏళ్ల లోపు ప్రతి ఒక్కరికి మాత్రలు అందించడానికి సంబంధిత శాఖలు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.నులిపురుగులు పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రధాన కారణమని,వాటి నివారణ ద్వారా పిల్లలు ఆరోగ్యవంతంగా, చదువులో ప్రతిభ కనబరుస్తారని అన్నారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జయలక్ష్మి,సిపిఓ సంజీవరావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,బోధక సిబ్బంది,సంబంధిత శాఖల అధికారులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాచారం గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే జారె

- అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డుల పంపిణీ





**దమపేట, ఆగస్టు11,(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం నాచారం గ్రామంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించి ప్రారంభించారు. హైమాస్ట్ లైట్లతో రాత్రివేళ గ్రామాలలో భద్రత పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జారే మాట్లాడుతూ రేషన్ కార్డుల ద్వారా పేదలకు నిత్యావసరాలు సులభంగా లభిస్తాయని, ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు ఎంతో ప్రామాణికరమైనదని, గత పది సంవత్సరాలలో కొత్త రేషన్ కార్డు పొందని వారికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో దమ్మపేట తహశీల్దారు భగవాన్ రెడ్డి, దమ్మపేట సొసైటీ చైర్మన్ యెల్లిన రాఘవరావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడి దొడ్డిదారిన తెచ్చిన ఎన్ఆర్ సి అమలును ఆపాలి

- ప్రజాస్వామ్య ప్రక్రియకు ఎస్ ఐఆర్ అత్యంత ప్రమాదకరం
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న



**పినపాక, ఆగష్టు 11(ప్రజాజ్యోతి):**మనదేశ పౌరుల ఓటు హక్కును హరించే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం బీహార్లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సోమవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల అక్రమ తొలగింపు ఆపాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడి దొడ్డిదారిన ఎన్ఆర్సి అమలును ఆపాలి' అని నినాదాలు చేశారు. పార్లమెంటరీ, ప్రజాస్వామ్య ప్రక్రియకు ఎస్ఐఆర్ అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఎన్డిఎ–బిజెపి వ్యతిరేక పక్షాలు నిర్వహించే పోరాటంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కలిసి రావాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో ఆ పార్టీల మనుగడ, ఉనికి ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర ఎన్నికల సంఘం కేంద్రంలోని మోడీ–బిజెపి ప్రభుత్వానికి తొత్తుగా, కీలుబమ్మగా తయారైందన్నారు. దేశ ప్రజల ఓటు హక్కును నిరాకరించడమే ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశంగా ఉందని తెలిపారు. మొత్తం ఓటర్ల జాబితాను తిరగదోడే ప్రయత్నం జరుగుతోందన్నారు. దీనివల్ల ఇప్పటికే బీహార్లో 15 లక్షల మంది ఓట్లు కోల్పోయారని, మరో 45 లక్షల మంది ఓట్లు త్రిశంకు స్వర్గంలో ఉన్నాయని తెలిపారు. నేను ఓటర్నే...నాకు ఓటు ఇవ్వండి అని తనను తాను రుజువు చేసుకోవాల్సిన బాధ్యతను ఓటర్లపైనే పెట్టారన్నారు. ఎస్ఐఆర్కు వ్యతిరేకంగా అందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దుబ్బా గోవర్ధన్, సిపిఎం మండల కమిటీ సభ్యులు మడివి రమేష్, కారం రమేష్ తదితరులు పాల్గొన్నారు